## కేసులను త్వరగా పరిష్కరించాలి



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, నవంబర్ 1 : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతూ.. కేసుల్లో పూర్తిస్థాయిలో ఇన్వెస్టిగేషన్ చేసి త్వరగా పరిష్కరించాలని అన్నారు. సైబర్ క్రైం ద్వారా బాధితులు కోల్పోయిన డబ్బులు త్వరగా రీఫండ్ అయ్యేలా చూడాలని సూచించారు. పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించాలని అన్నారు. అనంతరం రెండు వారాల స్టేషన్ రైటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 18 మంది మహిళా అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వర్‌రావు, సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జార్జ్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, జిల్లాలోని ఎస్సైలు పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై దాడి

### 309 మందిపై కేసులు నమోదు

### రూ.7,79,740 నగదు, 146 మొబైల్స్ స్వాధీనం

కామారెడ్డి, నవంబర్ 1 : జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో పేకాట ఆడినవారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేకాడినందుకుగాను 42 కేసుల్లో 309 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. మూడు రోజుల్లో రూ.7,79,740 నగదు, 146 మొబైళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే కామారెడ్డి టాస్క్ ఫోర్స్ అధికారుల నంబర్లు 8712686109, 8712686133 లేదా సంబంధిత పోలీసు స్టేషన్‌కు, డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

## జిల్లాలో 30 యాక్ట్ అమలు

కామారెడ్డి, నవంబర్ 1 : జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ 1861ను అమలు చేస్తున్నట్లు ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా ఈ నెల 30వ తేదీ వరకు 30 యాక్ట్, పోలీసు యాక్ట్ 1861 జిల్లాలో అమలులో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలనుకుంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మున్సిపల్ కమిషనర్‌కు వీడ్కోలు



మున్సిపల్ కమీషనర్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కామారెడ్డి, నవంబర్ 1 : కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన సుజాత బదిలీపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లిన సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు హఫీజ్ బేగ్, నజీరుద్దీన్, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

నిజాంసాగర్/బాన్సువాడ రూరల్/బీబీపేట్/నాగిరెడ్డిపేట/గాంధారి/ లింగంపేట, నవంబర్ 1 : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కులగణన సర్వే కోసం కుటుంబాలను గుర్తించే ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ బంజేపల్లి, గోర్గల్ గ్రామాలను సందర్శించి కుటుంబాలను గుర్తించే ప్రక్రియను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఎంపీవో అనిత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో శుక్రవారం సమగ్ర ఇంటింటి సర్వే ప్రారంభమైంది. మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామస్థాయి సిబ్బందితో ఇంటింటికీ తిరుగుతూ కుటంబ సభ్యుల సర్వే కోసం ఇండ్లను గుర్తించి స్టిక్కర్లు అంటించారు. సేకరించిన వివరాలను ఎన్యూమరేటర్లు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. సర్వేను ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి పర్యవేక్షించారు. బీబీపేట, తుజాల్‌పూర్ గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి సతీశ్‌యాదవ్, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ సర్వేను పర్యవేక్షించారు. నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి గ్రామంలో కుల గణన సర్వేను మండల ప్రత్యేకాధికారిణి రత్నం తనిఖీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో కుల గణన సర్వే సామగ్రిని ఎన్యూరేటర్లకు ఎంపీడీవో ప్రభాకర్ అందజేశారు. గాంధారి మండలంలోని 45 గ్రామ పంచాయతీల్లో ఇంటింటి సర్వేను అధికారులు ప్రారంభించారు. 132 మంది ఎన్యూమరేటర్లకు సర్వే మెటీరియల్‌ను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్ అందజేశారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో కుల గణన సర్వే ప్రారంభమైనట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు. రాంపల్లి, రాంపల్లి స్కూల్ తండా, ఐలాపూర్ గ్రామాల్లో చేపడుతున్న సర్వేను మండల పంచాయతీ అధికారి మలహరి పరిశీలించినట్లు తెలిపారు.



నిజాంసాగర్ మండలంలో
సర్వేలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

భిక్కనూరు, నవంబర్ 1 : మండలంలోని జంగంపల్లి సింగిల్ విండో ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ సిద్ధరాములు, వైస్ చైర్మన్ వాసు యాదవ్, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, శివకుమార్, రాములు, విఠల్, గురవారెడ్డి, రైతులు వెంకట్ యాదవ్, సాయిరెడ్డి, ప్రకాశ్‌గౌడ్, నిమ్మల స్వామి, సీఈవో రమేశ్ యాదవ్, ఏఈవో లిఖిత్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

**రాజంపేట్‌లో రేషన్‌షాపు..**

రాజంపేట్, నవంబర్ 1 : మండలకేంద్రంలో రేషన్ షాప్‌ను తహసీల్దార్ అనిల్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. రేషన్‌కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకాలంలో బియ్యం పంపిణీ చేయాలని సూచించారు. ఆర్ఐ నజీమొద్దీన్, జూనియర్ అసిస్టెంట్ సరిత పాల్గొన్నారు.

## వీసాలపేరుతో మోసం చేస్తున్న వ్యక్తి అరెస్టు

రాజంపేట్, నవంబర్ 1 : విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని వీసాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న వ్యక్తిని రాజంపేట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండ మండలానికి చెందిన గౌడ మల్లేశం మండలానికి చెందిన ముగ్గురు నిరుద్యోగులకు వీసా ఇప్పిస్తానని చెప్పి లక్షల్లో డబ్బులు వసూలు చేశాడు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేశారు. కొంత కాలంగా పరారీలో ఉన్న అతడు.. ఖమ్మంలో ఉన్నాడనే సమాచారంతో అక్కడికి వెళ్లిన పోలీసులు నిందితుడిని పట్టుకుని విచారించి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. కేసును ఛేదించేందుకు కృషి చేసిన కానిస్టేబుల్ శ్రీనివాస్, రాజేశ్, రవీందర్‌ను ఎస్సై అభినందించారు.

## సిబ్బందికి అవగాహన కల్పించాలి



రోగులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ, నవంబర్ 1 : దవాఖానకు వచ్చేవారితో బాధ్యతగా మాట్లాడేలా వైద్య సిబ్బందికి అవగాహన కల్పించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మికి సూచించారు. పట్టణంలోని మాతా శిశు దవాఖానలో సుమారు రూ.25 లక్షల వ్యయంతో రోగుల సౌకర్యార్థం నిర్మిస్తున్న తాత్కాలిక షెడ్డును సబ్ కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానలో పర్యటించి వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లో దవాఖానలకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయాలన్నారు. అక్కడ పర్యటనకు వెళ్లినప్పుడు సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో దవాఖాన ఆర్ఎం డాక్టర్ సుజాత, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణవేణి, డాక్టర్ విజయభాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నిర్లక్ష్యం చేసిన వారిపై చర్యలు తీసుకోండి**

పిట్లం మండలం మద్దెల్ చెరువు గ్రామానికి చెందిన గైని రామవ్వను విరేచనాల కారణంగా బాన్సువాడలోని మాతా శిశు దవాఖానకు గురువారం తీసుకువచ్చారు. రామవ్వకు రక్త పరీక్షలు చేయలేదని, కానీ.. రక్త పరీక్షలు చేసినట్లు సర్టిఫికెట్ అందజేశారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదే విషయంపై రామవ్వ కుమారుడు రక్త పరీక్ష చేయకుండానే సర్టిఫికెట్ ఎలా ఇస్తారని వాగ్వాదానికి దిగారు. దవాఖానలో గైని రామవ్వతో పాటు మరో రామవ్వ అనే పేషెంట్ ఉంది. ఆ పేషెంట్‌కు చేసిన రక్త పరీక్షల సర్టిఫికెట్‌ను గైని రామవ్వ అనే పేషెంట్‌కు ఇచ్చారు. ఇది సిబ్బం ది తప్పుదమని దవాఖాన వర్గాలు తెలిపాయి. ఈ విషయం బాధిత కుటుంబ సభ్యులు బాన్సువాడ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సబ్ కలెక్టర్ దవాఖానకు వచ్చి విచారణ చేపట్టారు. తప్పిదం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ విజయభాస్కర్, ఆర్ఎంవో డాక్టర్ సుజాతతోపాటు సిబ్బంది ఉన్నారు.

## ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

రాజంపేట్, నవంబర్ 1 : ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ అనిల్ కుమార్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దేవిరెడ్డి విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడా టార్పాలిన్లు అందించాలన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సిద్ధిరాములు, ప్రధాన కార్యదర్శి రాంచంద్రం, ఆయా గ్రామాల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, సాయిరెడ్డి, రాములు, రాంరెడ్డి, గంగారెడ్డి, బాల్‌రాజ్‌రెడ్డి, రాజిరెడ్డి, రమేశ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

మాచారెడ్డి, నవంబర్ 1 : స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యుడి నుంచి జడ్పీ చైర్మన్ వరకు సత్తాచాటి అన్ని స్థానాలను బీజేపీ కేవసం చేసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. మాచారెడ్డి, పాల్వంచ మండల కేంద్రాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన బీజేపీ కార్యవర్గ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్త ప్రజల మధ్యలో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. బీజేపీ మండలాధ్యక్షులు బూస సురేశ్, అనిల్, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, గంగారాం, నర్సింహులు, పరశురాములు, హారిక, నరేశ్, భరత్, సాయి రాంగౌడ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కామారెడ్డి, నవంబర్ 1 : స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 పోటీల విభాగంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జట్టులో కామారెడ్డి మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థి రేకులపల్లి అరుణ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలీ, పీడీ రవి, అధ్యాపకులు అభినందించారు.

## కొనసాగుతున్న పోలీస్ పికెట్

బాన్సువాడ, నవంబర్ 1 : బాన్సువాడలో ఇటీవల ఏడేండ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన ఘటనపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నది. ఇప్పటికే ఆ వ్యక్తి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణంలో గొడవలు జరుగకుండా 30 మంది పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి, బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

బాన్సువాడ టౌన్, నవంబర్ 1 : పట్టణంలోని 16వ వార్డుకు చెందిన శ్రీవాణి కుటుంబ సభ్యులకు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్..

మాచారెడ్డి, నవంబర్ 1 : పాల్వంచకు చెందిన తోట లక్ష్మణ్ ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి శుక్రవారం అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

## నాయీబ్రాహ్మణ సంఘం కార్యవర్గం

బీబీపేట్, నవంబర్ 1 : మండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో నాయీబ్రాహ్మణ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా స్వామి, ఉపాధ్యక్షుడిగా నాగరాజ్, ప్రధాన కార్యదర్శిగా బాబు, కోశాధికారిగా ఆనంద్ కుమార్, ప్రచార కార్యదర్శిగా నరేశ్ తదితరులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సభ్యులు ప్రశాంత్, రాకేశ్, మధు, బాబు, ఈశ్వర్ పాల్గొన్నారు.

## మురికి కాలువలో పడి ఒకరి మృతి

పెద్ద కొడప్‌గల్, నవంబర్ 1: ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో వైన్ షాప్ సమీపంలో ఉన్న బ్రిడ్జి పక్కన మురికి కాలువలో పడి మృతి చెందాడని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు బోర్లం గ్రామానికి చెందిన నాందేడం వెంకటి (48)గా గుర్తించారు. వెంకటి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో వంట మనిషిగా పని చేస్తున్నట్లు తెలిపారు. భార్య కోటవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## లింగంపల్లి గ్రామ శివారులో వ్యక్తి హత్య

రామారెడ్డి, నవంబర్ 1: సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామ శివారులోని జనగామ గ్రామానికి వెళ్లే దారిలో డంపింగ్ యార్డు వద్ద గుర్తు తెలియని వ్యక్తిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన ఘటన గురువారం జరిగింది. ఘటనా స్థలాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సంతోష్, సదాశివనగర్ ఎస్సై రంజిత్ సందర్శించి మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. శుక్రవారం సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి పేరు పిట్టల కృష్ణ (38) నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం గ్రామస్తుడిగా గుర్తించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## మతిస్థిమితం లేక బాలుడు ఆత్మహత్య

రామారెడ్డి నవంబర్ 1 : సదాశివనగర్ మండలం వజ్జెపల్లి గ్రామంలో మంద బుద్ధితో బాలుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సదాశివనగర్ ఎస్సై రంజిత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పెరం భానుప్రసాద్ (11) మంద బుద్ధితో మతిస్థిమితం లేక శుక్రవారం గుర్తు తెలియని క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే నిజామాబాద్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఇద్దరి ఎంపిక

నాగిరెడ్డిపేట, నవంబర్ 1: మండల కేంద్రం గోపాల్‌పేట ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రాంరెడ్డి తెలిపారు. గత నెలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన కబడ్డీ అథ్లెటిక్స్‌లో అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన ఎం. కార్తీక్(కబడ్డీ), సీహెచ్ మౌనిక( షాట్‌పుట్)లో తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను శుక్రవారం ఎస్సై మల్లారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్సై ఉమేశ్, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రాంరెడ్డి, పీడీ సబాత్‌కృష్ణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రామారెడ్డి, నవంబర్ 1: సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి సొసైటీ పరిధిలోని ఇసన్నపల్లి, కన్నాపూర్, గిద్ద, తదితర గ్రామాల్లో శుక్రవారం సొసైటీ చైర్మన్ మర్రి సదాశివరెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాడు. డైరెక్టర్లు బత్తుల రాంరెడ్డి, భాస్కర్, సొసైటీ సీఈవో కడెం భైరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

లింగంపేట, నవంబర్ 1: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎల్లమయ్య, అశోక్, రఫీక్, రామాగౌడ్, ఖయ్యూమ్, ఏదుల్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ గురుకుల పాఠశాలలో సంబురాలు

లింగంపేట, నవంబర్ 1: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో శుక్రవారం పాఠశాల సిబ్బంది, విద్యార్థులు సంబరాలు నిర్వహించారు. బీసీ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

# ఆనందోత్సాహాలతో దీపావళి పండుగ

బాన్సువాడ/బీబీపేట్/రాజంపేట్/బాన్సువాడ టౌన్/ఎల్లారెడ్డి రూరల్/లింగంపేట/నాగిరెడ్డిపేట/పెద్ద కొడప్‌గల్, నవంబర్ 1 : జిల్లా వ్యాప్తంగా దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ప్రతి ఇంట్లో ఆడబిడ్డలు హారతులు ఇచ్చి, అన్నదమ్ములను ఆశీర్వదించారు. దుకాణాలు, వ్యాపారులు, ప్రతి ఇంట లక్ష్మి పూజలు నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు పటాకులు కాలుస్తూ.. ఆనందోత్సహాల మధ్య పండుగను జరుపుకొన్నారు. పండుగ సందర్భంగా వాణిజ్య, వ్యాపార సముదాయాల్లో వేద పండితులతో ధన లక్ష్మి పూజలు నిర్వహించుకున్నారు. హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. బీబీపేటలోని పెద్దమ్మ ఆలయం వద్ద ముదిరాజ్ సదర్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి మహిళలు పెద్దమ్మకి బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు, సాయంత్రం ఆలయం చుట్టూ ఎండ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. బాన్సువాడలోని బస్టాండ్ ఆవరణలో దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీ పూజలు నిర్వహించారు. ఎల్లారెడ్డి పట్టణంలో ప్రజలు ఘనంగా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఉదయం ఇండ్లలో మహిళలు కుటుంబ సభ్యులకు హారతులిచ్చారు. అనంతరం పిల్లలు వాకిళ్లలో పటాకులు కాల్చి పండుగను ఆహ్వానించారు. మధ్యాహ్నం 3గంటల నుంచి పట్టణంలోని వ్యాపార సంస్థలలో లక్ష్మీపూజలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు పటాకులు కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో దీపావళి పండుగను వైభవంగా జరుపుకొన్నారు. పండుగ సందర్భంగా చిన్నారులు, పెద్దలు పటాకులు కాలుస్తూ ఆనందోత్సహాల మధ్య ఘనంగా చేసుకున్నారు. వాణిజ్య, వ్యాపార సముదాయాల్లో వేద పండితులచే ధన లక్ష్మీ పూజలు నిర్వహించారు. నాగిరెడ్డిపేట మండలంతో పాటు ఆయా గ్రామాల్లో దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఇళ్లను విద్యుత్ కాంతులు, దీపాలతో అలంకరించుకున్నారు. రాత్రివేళ లక్ష్మి పూజలను భక్తి శ్రద్దలతో నిర్వహించుకున్నారు. తీపి వంటలు చేసుకొని కుటుంబసభ్యులతో కలిసి ఆరగించారు. పెద్ద కొడప్‌గల్ మండలంలో దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు, పిల్లలు, పెద్దలు ఇంటిలో ప్రమిదలు పెట్టి దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. బాణసంచా కాలుస్తూ పండుగ జరుపుకున్నారు.



హైదరాబాద్‌లోని తన నివాసంలో లక్ష్మీ పూజలు చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహదారు పోచారం



పిట్లంలో బాణసంచా కాల్చుతున్న మహిళలు

# ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

లింగంపేట/గాంధారి/నాగిరెడ్డిపేట/రామారెడ్డి, నవంబర్ 1: లింగంపేట, తాడ్వాయి మండల కేంద్రాల్లోని తహసీల్ కార్యాలయాల వద్ద భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ తూకం ఆరంభం కాకపోవడం పట్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని బీకేఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు కొనుగోలు కేంద్రాల్లో టార్పలిన్ కాగితాలు రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల శాఖ అధ్యక్షుడు సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ గౌడ్, విద్యుత్ వినియోగదారుల ఫోరం సభ్యుడు రాజాగౌడ్, రైతు సంఘం నాయకులు రైతులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కాంటలను వెంటనే ప్రాంభించాలని భారతీయ కిసాన్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధారి మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయానికి ర్యాలీగా బయలుదేరిన రైతు సంఘం నాయకులు తహసీల్దార్ సతీశ్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘం అధ్యక్షుడు ఆర్ల మాధవరావు, రమేశ్‌రావు, సూర్ల కిషన్, చందర్‌రావు, శ్రీహరి, ఆర్ల రాజు నాయకులు ఉన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసనలు కొనసాగాయి. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్ కార్యాలయం చేరుకొని తహసీల్దార్ శ్రీనివాస్‌కు తమ డిమాండ్‌లతో కూడిన వినతిప త్రం అందించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు కాంత్‌రెడ్డి, రైతులు ఉన్నారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, 500 రూపాయల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ రామారెడ్డి మండల కేంద్రంలో శుక్రవారం భారత్ కిసాన్ సంఘ్ మండల ప్రెసిడెంట్ నారెడ్డి రాజిరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ సువర్ణకు వినతి పత్రం అందజేశారు.



రామారెడ్డి తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న భారతీయ కిసాన్‌సంఘ్ సభ్యులు

# ఆస్తిలో వాటా కోసం భర్త ఇంటి ముందు భార్య ధర్నా

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 1: తనను వివాహం చేసుకొని 30 ఏండ్లు అయినప్పటికీ, మరోమహిళతో సహజీవనం చేస్తూ తనను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ భర్త ఇంటి ఎదుట ఓ మహిళ ధర్నా చేసింది. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్ గ్రామంలో గురువారం ఈ ఘటన జరిగింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చెర్ల ప్రేమానందం 30 ఏండ్ల క్రితం సుశీల అనే మహిళను వివాహం చేసుకున్నాడు. బ్యాంకులో పని చేసిన ప్రేమానందం ఇటీవల రిటైర్డ్ అయ్యాడు. భార్యతో కొన్నేండ్లుగా గొడవలు ఉండడంతో మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు.

దీంతో ప్రేమానందం భార్య సుశీల తన కొడుకు, కోడలుతో కలిసి శుక్రవారం భర్త ఇంటి ఎదుట కూర్చుని ధర్నా చేసింది. తనతో వివాహం జరిగినప్పటికీ మానవతా విలువలకు, సంబంధ బాంధవ్యాలకు విలువ ఇవ్వకుండా వేరే మహిళతో ఉంటూ తమను పట్టించుకోవడం లేదని, తనను, తన కుమారున్ని రోడ్డున పడేశాడని సుశీల వాపోయింది. తనకు ఆస్తిలో వాటా ఇవ్వమంటే పట్టించుకోవడం లేదని, తమకు ఆయన రిటైర్‌మెంట్ డబ్బులతో పాటు, స్థిర, చరాస్తుల్లో వాటా ఇవ్వాలని, తమకు న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగినట్లు తెలిపింది. ఆమెకు గ్రామస్తులు కూడా మద్దతు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లగా పోలీసు వాహనానికి అడ్డుపడి తమకు న్యాయం చేయాలని వేడుకుంది. పో లీసులు సుశీల, ఆమె భర్త ప్రేమానందంకు నచ్చజెప్పి పోలీస్ స్టేషన్‌కు తీసుకుపోవడంతో గొడవ సద్దుమణిగింది.

## అవినీతి నిర్మూలనే సమాచార హక్కు చట్టం లక్ష్యం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 1: అవినీతి నిర్మూలనే సమాచార హక్కు చట్టం ప్రధాన లక్ష్యమని జిల్లా సలహాదారు లింగమయ్య అన్నారు. శుక్రవారం ఆయన ఎల్లారెడ్డి పట్టణంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రి, ఉపాధ్యాయురాళ్లు, సమాచార హక్కుచట్టం పట్టణ సలహాదారు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి సీఎస్ఐ చర్చిలో బైబిల్ క్విజ్

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 1 : ఎల్లారెడ్డి పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో బైబిల్ క్విజ్ నిర్వహించినట్లు ప్రెస్బిటర్ ఇన్‌చార్జి, రెవరెండ్ ఎర్రోళ్ల ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ మహాదేవాలయం నిర్మించి వంద ఏండ్లు పూర్తి అవుతున్న సందర్భంగా ముషీరాబాద్ పాస్టరేట్ వారు ''వెస్లియన్ క్రైస్తవనరీ – బైబిల్ క్విజ్'' నిర్వహించారు. తాండూర్, రుద్రారం, భిక్కనూర్, బాన్సువాడ, పిట్లం, కృష్ణాపూర్ నుంచి వచ్చిన అభ్యర్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రెవరెండ్ అనూప్, ఏసుదాస్, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

## ముంబాజీపేటలో వైద్య శిబిరం

లింగంపేట, నవంబర్ 1 : మండలంలోని ముంబాజీపేట గ్రామంలో శుక్రవారం పశువైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు మండల వైద్యాధికారి జోన హనస్ తెలిపారు. జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రవికుమార్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ సాయిలు, గోపాల మిత్రలు ఎజాస్, రమేశ్, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఐడీకార్డుల వితరణ

నాగిరెడ్డిపేట, నవంబర్ 1: మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం బంజారా డీఎన్‌టీ పాఠశాల ఉపాధ్యాయుడు సత్యనారాయణ మూర్తి, కొన బాన్సువాడ ఎల్‌ఎఫ్ఎల్ హెచ్‌ఎం రాజశేఖర్ చౌదరి వారి మిత్రబృందంతో కలిసి..ఐడీ కార్డులను అందజేశారు. రూ.30వేల ఖర్చుతో పాఠశాలలోని 300 మందికి ఐడీ కార్డులను తయారు చేయించి ఇచ్చామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయులు వాసుదేవరావు, రాము, తదితరులు ఉన్నారు.

## పౌరహక్కులపై అవగాహన సమావేశం

నిజాంసాగర్, నవంబర్ 1 : మహ్మద్‌నగర్ మండలం నర్వ గ్రామంలో నిజాంసాగర్ ఎస్సై కె. సుధాకర్ ఆధ్వర్యంలో పౌరహక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పౌరులకు ఉన్న హక్కులు, వాటి విధుల గురించి వివరించారు. కార్యక్రమంలో మహ్మద్‌నగర్ ఆర్ఐ ఎన్. సాయిలు, ఆల్ ఇండియా అంబేద్కర్ మండల అధ్యక్షుడు రాములు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 1: డబుల్‌బెడ్ రూం ఇండ్ల వద్ద చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డి శివారులోని సోమార్‌పేట్ బేస్‌లో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్ద జరుగుతున్న పనులను ఆయన మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజుతో కలిసి పరిశీలించారు. పనులను సూచించిన కాలములో నాణ్యతగా చేసి ముగించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

## గాంధారిలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

గాంధారి, నవంబర్ 1: మండల కేంద్రంలోని (ఈఎంఆర్ఎస్) ఏకలవ్య మోడల్ పాఠశాలలో శుక్రవారం నుంచి తెలంగాణ రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ ఒకటి నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో రాష్ట్రంలోని 23 ఈఎంఆర్ఎస్ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ పోటీలో అండర్ -14, అండర్ -17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్‌తోపాటు, అథ్లెటిక్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.